తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

గజ్వేల్, ఫిబ్రవరి 21: గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని బీడీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్ సందర్శించి చిన్నారుల తల్లిదండ్రులు, బాలింతలతో మాట్లాడారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో వెంకటరాజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరిపించాలి

అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

గజ్వేల్, ఫిబ్రవరి 21: గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని కోరుతూ కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు కౌన్సిలర్లు బొగ్గుల చందు, రజిత, శ్రీనివాస్, అల్వాల బాలేశ్, బాలమణి, వరలక్ష్మి, విద్యరాణి, అత్తెల్లి శ్రీనివాస్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గత నెలలో జరిగిన మున్సిపల్ సమావేశంలో ఎలాంటి పనులు చేయకుండానే డబ్బులు డ్రా చేసిన విషయంపై కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మన్ రాజమౌళిని నిలదీశారు. దీనిపై వారం రోజుల్లోనే నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారని, రోజులు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోగా సరైన సమాధానం చెప్పడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో కూడా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మున్సిపల్‌లో జరుగుతున్న నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతోనే బుధవారం జరిగిన బడ్జెట్ సమావేశానికి హాజరు కాలేదని తెలిపారు. తమ ఫిర్యాదుపై వెంటనే చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 21: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు కృషి చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ప్రభాకర్ అన్నారు. బుధవారం మద్దూరు మండలంలోని లద్నూర్ పీహెచ్‌సీని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

సీపీని కలిసిన రవాణాశాఖ అధికారులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 21: సిద్దిపేట డీటీవోగా బాధ్యతలు స్వీకరించిన వేణు, ఎంవీఐలు కొండల్‌రావు, క్రిస్టఫర్, శంకర్, నారాయణ, ఏఎంవీఐ సంతోష్‌రెడ్డి బుధవారం పోలీస్ కమిషనర్ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

సీపీని కలిసిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్..

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 21: సిద్దిపేట సీఏఆర్ హెడ్ క్వార్టర్‌కు కొత్తగా వచ్చిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ విష్ణుప్రసాద్ బుధవారం సీపీ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌ను సీపీ అభినందించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సిద్దిపేట : మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఫిబ్రవరి 21: మహిళల్లో గొప్ప చైతన్య స్ఫూర్తి ఉంటుందని, మహిళలు ఆర్థికంగా ఎదగాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లి గ్రామంలోని 15 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ గ్రామంలోని మహిళలకు ఇటీవల ఉచితంగా కుట్టుమిషన్‌లో శిక్షణ ఇచ్చామని, నేడు వారికి కుట్టు మిషన్లను ఉచితంగా ఇవ్వడం సంతోషంగా ఉన్నదన్నారు. గ్రామంలో జ్యూట్ బ్యాగులు తయారు చేయాలన్నారు. మహిళల ఆర్థికచేయూతకు కుట్టుమిషన్లు ఇసున్నామని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.

బాధిత కుటుంబాలకు భరోసా..

నంగునూరు, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను మాజీ మం త్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించి ఓదార్చారు. మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బండి వెంకటయ్య ఇటీవల హత్యకు గురికావడంతో కుమారుని మరణాన్ని జీర్ణించుకోలేక రోదిస్తూ అతడి తండ్రి బండి బాలమల్లు(90) బుధవారం కుప్పకూలాడు. విషయం తెలుసుకున్న ఎమ్మె ల్యే మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త ఎల్లంకి వెంకటరెడ్డి ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించి ఆదుకుంటామని భరోసానిచ్చారు.

ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

మండల సీనియర్ జర్నలిస్ట్ పాలమాకుల గ్రామానికి చెందిన రిపోర్టర్ తులసీదాస్ బంధువులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మరికొందరికి గాయాలయ్యాయి. అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త అసర్ల యాదగిరి తల్లి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

నంగునూరు : వెంకటయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఎమ్మెల్యే పల్లాను విమర్శిస్తే సహించేది లేదు

చేర్యాల, ఫిబ్రవరి 21: జనగామ ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి లేదని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కార్యదర్శి గదరాజు యాదగిరి, బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు, బండమీది కరుణాకర్ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. వివిధ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై ఆరోపణలకు దిగడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జనగామ ఎమ్మెల్యే పల్లా దొంగ ఓట్లు నమోదు వేయించి వాటితో గెలిచాడని చేసిన ఆరోపణలు సరికాదన్నారు. బీఆర్‌ఎస్ సర్కారు ప్రజలకు చేసిన మంచి పనుల వల్లే ఎమ్మెల్యేగా పల్లా విజయం సాధించారని తెలిపారు. చేర్యాల ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గ ఇన్‌చార్జి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే పల్లాపై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

ఆర్థిక సాయం అందజేత

గజ్వేల్, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని కొల్గూర్‌లో తల్లిదండ్రులను కొల్పోయి అనాథలైన చిన్నారులకు గజ్వేల్‌కు చెందిన చేయూత సభ్యులు రూ.6 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మధుబాబు, శ్రీనివాస్, గౌస్, స్వామి, ప్రసాద్, రమేశ్ ఉన్నారు.

బేగంపేట ఎస్సైగా రవికాంత్‌రావు

వర్గల్, ఫిబ్రవరి21: బేగంపేట నూతన ఎస్సైగా రవికాంత్‌రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు సీపీ కార్యాలయంలో కమిషనర్ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి చార్జి తీసుకున్నారు. విధి నిర్వహణలో గంజాయి, సైబర్ నేరాలు, పీడీ రైస్, చట్ట విద్రోహక చర్యల నియంత్రణలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

వనం నుంచి జనంలోకి..

మద్దూరు : కూటిగల్‌లో సారలమ్మను గద్దెలపైకి తీసుకొస్తున్న కోయ పూజారులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 21: ధూళిమిట్ట మండలంలోని కూటిగల్‌లో సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. తొలిరోజు డప్పుచప్పుళ్లు, ఒగ్గు కళాకారుల విన్యాసాలు శివసత్తుల పూనకాల మధ్య కోయ పూజారులు గ్రామానికి పడమర నుంచి మట్టికుండలో సారలమ్మను ఊరేగింపుగా గద్దెల వద్దకు తీసుకవచ్చి ప్రతిష్ఠించారు. సారలమ్మను తీసుకొచ్చే సమయంలో గ్రామమంతా జనాలతో కిక్కిరిసిపోయింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ కొండూరి శ్రీనివాస్, సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సందడిగా సమ్మక్క- సారలమ్మ జాతర..

చేర్యాల, ఫిబ్రవరి 21 : పట్టణ శివారు బురాన్‌మియా తోటలో బుధవారం సమ్మక్క, సారలమ్మ జాతరను కమిటీ సభ్యులు ఘనంగా ప్రారంభించారు. జాతరలో మొదటి రోజు సారలమ్మను పూజారులు గద్దెకు తీసుకువచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. గురువారం సమ్మక్కను గద్దెకు వచ్చుట, 23న వనదేవతలకు మొక్కులు చెల్లించడం, 24న సమ్మక్క, సారలమ్మ వన ప్రవేశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించే జాతరకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

మేడారంలో ఎమ్మెల్యే పల్లా..

చేర్యాల, ఫిబ్రవరి 21: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు బుధవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి వెళ్లి వన దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఆయనతో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు, బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మేడారంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

పెద్దమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

రాయపోల్, ఫిబ్రవరి 21: మండలంలోని అనాజీపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆలయానికి తనవంతు సహాయసహకారాలు అదిస్తానన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ యాదగిరి, కోఆప్షన్ సభ్యుడు పర్వేజ్ అహ్మద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ పాల్గొన్నారు.

అనాజీపూర్ పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

ఇందిరాగాంధీ శిలాఫలకం ధ్వంసం

మిరుదొడ్డి, ఫిబ్రవరి 21: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన ఘటన మిరుదొడ్డి మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బుధవారం మిరుదొడ్డి ఎస్ఐ బి.పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మిరుదొడ్డి టౌన్‌లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అదేరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజేశం వెంట నాయకులు భూమాగౌడ్, శ్రీనివాస్, కనకారెడ్డి, రాజు, కిష్టయ్య ఉన్నారు.

లారీ ఢీకొని బాలుడి మృతి

కుకునూర్‌పల్లి, ఫిబ్రవరి 21: లారీ ఢీకొని బాలుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపాక లావణ్య, తన ఇద్దరు కుమారులు దాసు, రుత్విక్‌తో కలిసి తల్లిగారి ఊరైన మాత్‌పల్లికి వెళ్లే క్రమంలో కుకునూర్‌పల్లికి ఆర్టీసీ బస్సు లో వచ్చింది. అక్కడి నుంచి మాత్‌పల్లికి వెళ్లేందుకు ఆటో కోసం రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి సిద్దిపేట వెళ్తున్న లారీ రుత్విక్‌ను(6) ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి ఎదుటే కుమారుడు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపించింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

PUBLIC NOTICE

Date: 21-02-2024.

The General Public hereby informed that my client **Mr. Pabbu Keerthi Kumar,** S/o. Pabbu Murali Goud, aged about 32 Years, Occ: Pvt. employee, R/o. H.No.5-94/15, Road No.5, Srujana Lakshmi Nagar, Phase-II, Krishna Reddipet, Patelguda, Ameenpur Mandal. Sangareddy District-502319, Telangana State has last a original link document/Sale Deed No. 47938/2018 relating to his above mentioned house purchased by him from Mr. Thottempudi Haranadh, S/o. T. Venkata Swami while he was travelling from Hyderabad to Doulthabad Village, Siddipet on 21-12-2023.

With reference to the above, if anybody have any rights, claims or **objections** on the above said property, may approach the under signed within 10 days from the date of Publication of the notice otherwise any objection received after this period will not bind on my client.

Sd/- K. HARI BABU
Advocate
MIG-17,
Dharma Reddy Colony
KPHB, Kukatpally,
Hyderabad-500072, T.S.
Mobile No. 9948108151

మాతృభాష.. కారాదు లోకువ

వర్గల్: భాషోద్యమ, సాహిత్య చిత్రపటాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వర్గల్, ఫిబ్రవరి 21: ప్రతి వ్యక్తి మాతృభాషతోనే బయట ప్రపంచాన్ని పరిచయం చేసుకుంటాడని, మాతృభాష తల్లితో సమానమని వర్గల్ జవహర్ కేంద్రీయ నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ రాజేందర్ అన్నారు. బుధవారం నవోదయ విద్యాలయంలో అంతర్జాతీయ భాషా దినోత్సవాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు సహస్ర, మనస్విని, రుత్విక్, సాహితి, సుదీక్ష, మహాలక్ష్మి ఉపన్యాసాలు, నృత్యాలు, గోడ పత్రికల ద్వారా మాతృభాష గొప్పతనాన్ని వివరించారు.

తీయనైనది మాతృభాష..

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 21: మాతృ భాష తీయనైనదని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో తెలంగాణ వైతాళికులపై విద్యార్థులు నిర్వహించిన చిత్ర ప్రదర్శన ఆలోచింపజేసింది. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు గోపాల్‌రెడ్డి, మహేందర్, మధుసూదన్, పల్లవి, అయోధ్యరెడ్డి పాల్గొన్నారు.

ఆరెపల్లి పాఠశాలలో..

మిరుదొడ్డి, ఫిబ్రవరి 21: ఆరెపల్లి ప్రాథమిక పాఠశాలలో మాతృ భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం భాగ్యలక్ష్మి తెలుగు భాషా ఔనత్యాన్ని విద్యార్థులకు వివరించారు.

కుకునూర్‌పల్లిలో..

కుకునూర్‌పల్లి, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుకునూర్‌పల్లిలో బుధవారం విద్యార్థులు కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో అష్టావధాని బండి అంజయ్యగౌడ్, అమ్మన చంద్రారెడ్డి పాల్గొని అగిడిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం చెప్పారు. అనంతరం విద్యార్థులకు కవి సమ్మేళనంపై సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్తయ్య, పోల్కంపల్లి నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'భువన విజయం'

కొండపాక, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండపాక మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 'భువన విజయం' అనే నాటక ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా తెలుగు బాష గొప్పతనాన్ని నాటకంలో ప్రదర్శించారు. ఈ నాటకానికి దర్శకత్వం వహించిన తెలుగు ఉపాధ్యాయురాలు జి.సత్యలక్ష్మిని అభినందించారు.

జాతరకు రావాలని 'వొడితెల'కు ఆహ్వానం

కోహెడ, ఫిబ్రవరి 21: కోహెడ మండలం వింజపల్లి గ్రామంలో జరిగే సమ్మక్క, సారలమ్మ జాతరకు రావాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌ను బుధవారం ఆయన స్వగృహంలో వింజపల్లి గ్రామస్తులు ఆహ్వానించారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యుడు ద్యాగటి సురేందర్, నాయకులు ఉన్నారు.

శాస్త్రీయ విధానమే అభివృద్ధికి పునాది

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 21: శాస్త్రీయ విధానమే అభివృద్ధికి పునాది అని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అన్నారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్ ఉన్నత పాఠశాలలో 'మూఢ నమ్మకాలు-విద్యా ఆవశ్యకత, మహిళల రక్షణ' అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు మూఢనమ్మకాలను వీడాలన్నారు. భూత వైద్యం పేరుతో ఎవరైనా మోసానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సదస్సులో సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వరెడ్డి, ఏఎస్ఐ పరమేశ్వరి, సిబ్బంది రవిరాజ్, రాజు, ఇన్‌చార్జి హెచ్ఎం చంద్రమౌళి, పాల్గొన్నారు.

గజ్వేల్ బడ్జెట్ సమావేశం వాయిదా

గజ్వేల్, ఫిబ్రవరి 21: గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ వార్షిక బడ్జెట్ సమావేశాన్ని అధికారులు బుధవారం నిర్వహించారు. సమావేశానికి సంబంధించిన సమాచారాన్ని అధికారులు ముందుగానే 20 మంది కౌన్సిలర్లకు అందించారు. బుధవారం ఉదయం 11 గంటలకు బడ్జెట్ సమావేశం ప్రారంభం కావాల్సి ఉండడంతో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ ముందుగానే కార్యాలయానికి చేరుకున్నారు. సమావేశానికి కేవలం ఆరుగురు సభ్యులు మాత్రమే హాజరవడంతో కోరం సభ్యులు లేక అదనపు కలెక్టర్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి రెండు గంటలపాటు వేచి ఉన్నారు. అయినా ఒక్కరూ రాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. తిరిగి సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని కమిషనర్ తెలిపారు. సమావేశానికి 14 మంది కౌన్సిలర్లు గైర్హాజరవడంతో చైర్మన్ తీరుపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కష్టపడికాదు.. ఇష్టపడి చదవాలి

సమావేశంలో మాట్లాడుతున్న కనకచంద్రం

హుస్నాబాద్, ఫిబ్రవరి 21: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం ఆకాంక్షించారు. బుధవారం హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ఇంటర్మీడియట్ ఎంతో కీలమైనదని, ఇందులో రాణించిన ప్రతి విద్యార్థి ఉన్నత స్థానంలో స్థిరపడుతారన్నారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాం స్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపకులు ఎస్ఎస్ రాజు, మహేశ్‌కుమార్, సదానందం, కరుణాకర్, లక్ష్మయ్య, రాజేంద్రప్రసాద్, కవి త, సంపత్, నిర్మలాదేవి, హెచ్ఎం వెంకటయ్య పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

బెజ్జంకి, ఫిబ్రవరి 21: మండల కేంద్ర పరిధిలోని పాపయ్యపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో బుధవారం నవగ్రహాలు, శివలింగం, ధ్వజ స్తంభాన్ని పూరోహితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని పూజలు చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలిచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వీరాపూర్ గ్రామంలోని వడ్రంగి కమ్యూనిటీ భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గుగ్గిళ్ల గ్రామ శివారులో నిర్మించే ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని పోతారం, నర్సింహులపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన వెంట పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండలాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పోశయ్య తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

అలరించిన అర్ధ శతపద్య ఆవిష్కరణ

చేర్యాల, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మండలంలోని వేచరేణి ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్ఎం నరేందర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు రామచంద్రమూర్తి పర్యవేక్షణలో విద్యార్థులు నిర్వహించిన అర్ధ శతపద్య ఆవిష్కరణ ఘనంగా జరిగింది. విద్యార్థులకు 60 తెలుగు సంవత్సరాలు, తెలుగు నెలలు, పద్య పఠనం, కాళోజీ, శ్రీశ్రీ, సినారె వేషధారణ, ఆంగ్ల పదాలు రాకుండా తెలుగు ఉపన్యాసం, పాఠ్యపుస్తకం భాషాదోషాలు లేకుండా చదవడం, రాయడం వంటి పోటీలు నిర్వహించారు. 100 ప్రశ్నలతో ఆరు గ్రూపులుగా విభజించి తెలుగు భాషపై ప్రశ్నావళి నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేవీఎన్‌రెడ్డి, నరహరి, శశిరేఖ, పరమేశ్వరయ్య పాల్గొన్నారు.

చెడుకు దూరంగా ఉండాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 21: కష్టపడి చదివితేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. బుధవారం మద్దూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చిన్ననాటి నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని, మన చుట్టూ జరుగుతున్న నేరాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్సై షేక్ యూనూస్‌అహ్మద్, షీటీమ్ బృందం సభ్యులు సైదయ్య, అధ్యాపకులు, కానిస్టేబుళ్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ పోటీలకు విద్యార్థి ఎంపిక

మర్కూక్, ఫిబ్రవరి 21: జిల్లాస్థాయిలో ఇటీవల నిర్వహించిన సైన్స్ పోటీల్లో మర్కూక్ మండలం పాములపర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి నాగచైతన్యరెడ్డి రాష్ట్రస్థాయి సైన్స్‌టాలెంట్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఎచ్ఎం లతీసైదా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి నాగచైతన్యరెడ్డి అన్ని సబ్జెక్టుల్లో మంచి నైపుణ్యం ప్రదర్శించడమేకాకుండా మండల, జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి సైన్స్ టాలెంట్ పోటీల్లోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

గజ్వేల్, ఫిబ్రవరి 21: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన ఘటన గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం శేర్‌పల్లిబందారం గ్రామానికి చెందిన గడ్డమీది అరుణ్, అతడి స్నేహితుడు రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన నక్కాని దిలీప్ గజ్వేల్‌లోని బాలుర వసతిగృహంలో ఉంటూ బాలుర డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. బుధవారం ఉదయం బుక్స్ కోసం గజ్వేల్‌కు వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చారు. సంగాపూర్ నుంచి గజ్వేల్ వైపు వెళ్తున్న హోండా యాక్టివాను లిఫ్ట్ తీసుకొని వెళ్తుండగా మార్గమధ్యలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో గడ్డమీది అరుణ్(20)అక్కడికక్కడే మృతి చెందాడు. యాక్టివా నడుపుతున్న అయాన్, డిగ్రీ విద్యార్థి దిలీప్‌లకు తీవ్రగాయాలవడంతో వెంటనే ఇద్దరిని గజ్వేల్ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలిస్తుండగా మార్గమధ్యలో యాక్టివా నడుపుతున్న అయాన్(21) మృతి చెందాడు. తీవ్రగాయాలైన విద్యార్థి దిలీప్ చికిత్స పొందుతున్నాడు.

మృతులు అరుణ్, అయాన్ (ఫైల్)

కెనరా బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) Syndicate

పాలమాకుల (13404), మెయిన్ రోడ్డు నంగునూర్ మండలం, సిద్దిపేట తాలూకా పాలమాకుల-502375

ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేది & సమయం: 25-03-2024న ఉ. 11.00 గం. నుండి మ. 12.00 గం. వరకు (అమ్మకం ముగిసేంతవరకూ ప్రతిసారీ 5 నిమిషాల కాలవ్యవధిగల అపరిమిత పొడిగింపులతో). బయానా దాఖలుకు చివరి తేది: 22-03-2024న సా. 4.00 గం. వరకు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/చార్జ్ చేయబడిన, కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారిచే లాంఛనప్రాయ/భౌతిక స్వాధీనం చేసుకోబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ తెలిపిన విధంగా **కెనరా బ్యాంక్**కు బకాయిలు + దానిపై వర్తించని వడ్డీ మరియు బ్యాంక్ చార్జీలను రాబట్టుకొనుటకు **"ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా మరియు అక్కడ ఏమున్నదో అదే ప్రాతిపదికన"** విక్రయించబడతాయని ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

రుణగ్రహీత పేరు: శ్రీ కిష్టయ్య కుశాల (రుణగ్రహీత & తనఖాదారు) తండ్రి రాజయ్య, ఇంటి నం. 1-89/2, బద్దిపడగ గ్రామం, నంగునూరు మండలం, సిద్దిపేట-502375. **శ్రీ తుశాలపురం మధు (హామీదారు), తండ్రి రాజయ్య,** ఇంటి నం. 2-12-2, బద్దిపడగ గ్రామం, నంగునూరు మండలం, సిద్దిపేట-502375. **జాయింట్ రుణగ్రహీత: శ్రీమతి దేవమ్మ కుశాపురం (హామీదారు), భర్త. కనకయ్య,** బద్దిపడగ గ్రామం, నంగునూరు మండలం, సిద్దిపేట-502375.

మొత్తం కాంట్రాక్చువల్ బకాయి: రూ. 15,29,810.04 (పదిహేను లక్షల ఇరవై తొమ్మిది వేల ఎనిమిది వందల పది రూపాయల నాలుగు పైసలు మాత్రమే) మరియు వర్తించని వడ్డీ మరియు బ్యాంక్ ఛార్జీలు, ఖర్చులు, వ్యయాలతో సహా.

స్థిరాస్తి వివరణ: సిద్దిపేట, సిద్దిపేట అర్బన్ మండలం, పొన్నాల గ్రామం వద్ద గల ఎస్ఆర్ఓ సిద్దిపేట, రిజిస్టర్డ్ డాక్యుమెంట్ డీడ్ నం. 13252/2019, తేది: 12-09-2019 ప్రకారం ఎగ్జిక్యూట్ చేయబడిన మరియు 180.00 చదరపు గజాల విస్తీర్ణం, సర్వే నం. 24తో ప్లాట్ నం. 1320 కలిగిన ఖాళీ స్థలంతో ఖాళీ ప్లాట్ యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: 24 అడుగుల రోడ్డు, పడమర: ప్లాట్ నం. 1367, ఉత్తరం: ప్లాట్ నం. 1321, దక్షిణం: ప్లాట్ నం. 1319.

రిజర్వు ధర: రూ. 15,30,000/- **బయానా: రూ. 1,53,000/-**

రిజర్వు ధరలో 10% బయానా మొత్తాన్ని అధీకృత అధికారి, కెనరా బ్యాంక్ పేరున డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో డిపాజిట్ చేయాలి లేదా **RTGS/NEFT వివరాలు: కెనరా బ్యాంక్, పాలమాకుల శాఖ, అకౌంట్ నం. 209272434, IFSC కోడ్: CNRB00013404.** అకౌంట్ జమకు **22-03-2024**న లేదా ఆలోగా **సా. 4.00 గం.వరకు RTGS/NEFT/**ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా డిపాజిట్ చేయాలి.

ఆస్తిని 22-03-2024న ఉ.10.00గం. నుండి సా. 4.00గం. మధ్య తనిఖీ చేసుకోవచ్చును

*బ్యాంక్‌కు తెలిసిన తాకట్టు రుణభారాలు లేవు.
*ఆస్తి బ్యాంక్ లాంఛనప్రాయ/భౌతిక స్వాధీనత క్రింద కలదు.
అమ్మకం సవివరమైన నియమ నిబంధనల కోసం కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (**www.canarabank.com**) లో ఏర్పాటు చేసిన "ఇ-ఆక్షన్" లింక్‌ను రిఫర్ చేయండి లేదా ఏదేని పని రోజున కార్యాలయ వేళలలో **అధీకృత అధికారి, కెనరా బ్యాంక్, పాలమాకుల శాఖ** వారిని సంప్రదించవచ్చును. ఫోన్ నం. **9440905090**

తేది: 19-02-2024, ప్రదేశం: వరంగల్ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్.